# వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, మార్చి 29: మండలంలోని నాచగిరి లక్ష్మీనరసింహస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం 5.30 గంటలకు విమానరథంపై కొలువుదీరిన నరసింహస్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలకు వేదపండితులు పూజలు చేశారు. భక్తుల హర్షాతిరేకాలు, జయజయ ధ్వానుల మధ్య రథోత్సవం ఆకట్టుకున్నది. ఆయా ప్రాంతాల నుంచి రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

# నేడు బ్రాహ్మణ పరిషత్‌లో ఉగాది ఉత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ సభ్యులు

సిద్దిపేట, మార్చి 29: సిద్దిపేటలోని బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ సదనం భవనంలో నేడు 'ఉగాది ఉత్సవం' నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం బ్రాహ్మణ పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేలేటి రాధాకృష్ణశర్మ, మంగు హరిహరావు, దూసకంటి సత్యనారాయణ, వేలేటి భాస్కరశర్మ, కలకుంట్ల వెంకట నరసింహాచార్యులు, కలకుంట్ల రంగాచార్యులు, కలకుంట్ల శేషకుమార్, జక్కాపురం నాగరాజుశర్మ, బ్రహ్మభట్ల నాగరాజుశర్మ, నాగరాజుశర్మ, శనగల శేఖర్ శర్మ, ఒడితెల రమేశ్, శాస్త్రుల విజయ్ కుమార్, గండికోట రాజు మాట్లాడారు. ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరవుతారన్నారు. ప్రముఖ గేయ రామాయణగాథ కథకుడు బ్రహ్మశ్రీ రుక్మాభట్ల నరసింహరామశర్మ పంచాంగ శ్రవణం చేస్తారన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు హరీశ్‌రావు సన్మానం చేస్తారని తెలిపారు.

# ఉగాది వేద సన్మానానికి మల్లికార్జున్ ఎంపిక



మహాదేవుని మల్లికార్జున్

చేర్యాల, మార్చి 29: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఉగాది పురస్కార వేడుకల్లో నిర్వహించే వేద సన్మానానికి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వవసునామ సంవత్సర ఉగాది వేడుకల్లో ప్రధానార్చకుడు పాల్గొనడంతో పాటు ప్రభుత్వం నుంచి సన్మానం, నగదు పురస్కారం అందుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో 40 మందిని ప్రభుత్వం ఎంపిక చేయగా మల్లన్న ఆలయానికి చెందిన ప్రధానఅర్చకుడు ఉగాది పురస్కారానికి ఎంపిక కావడంపై ఆలయ ఉద్యోగుల సంఘంతో పాటు అర్చకుల సంఘం సభ్యులు అభినందించారు.

# సిద్దిపేట ఫౌండేషన్ సేవలు అమోఘం



రంజాన్ కిట్లు అందజేస్తున్న కడవేర్గు మంజులారాజనర్సు

సిద్దిపేట, మార్చి 29: ఇరవై ఏండ్లుగా సిద్దిపేట ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట మెట్రో గార్డెన్‌లో పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.. పేద ముస్లింలకు రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగరాజు, ముస్లిం పెద్దలు షమీమ్, లయిక్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉర్దూ'ను చిన్నచూపు చూడటం తగదు



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

సిద్దిపేట, మార్చి 29: ముస్లిం సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎక్కడా ఉర్దూభాష కనిపించలేదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ మొయిజ్ మండిపడ్డారు. శనివారం అయన సిద్దిపేటలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఉర్దూ భాషను చిన్నచూపు చూడటం సమంజసం కాదన్నారు. ఇఫ్తార్ విందుకు కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా మైనార్టీ అధికారి, ఆర్డీవోలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. ఇఫ్తార్ అనేది ప్రభుత్వం పరంగా కాకుండా కాంగ్రెస్ కార్యక్రమంలాగా నిర్వహించారన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులను ఇఫ్తార్ విందుకు ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆదాబ్ మొయిజ్, అహ్మద్,షౌకత్, గోరేమియా, కలీం, గౌస్, పాషా పాల్గొన్నారు.









# మాట నిలబెట్టుకున్న కలెక్టర్ మనుచౌదరి

- గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్కూల్ బస్సు కేటాయింపు




కొమురవెల్లి: హెచ్‌ఎం బొజ్జ రాజుకు బస్సు పత్రాలు అందజేస్తున్న హెచ్‌వో రామస్వామి, డీటీవో కొండల్‌రావు

కొమురవెల్లి, మార్చి 29: మండలంలోని గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మార్చి 15న ఏఐ(ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించేదుకు కలెక్టర్ మనుచౌదరి వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఊరు చివర ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ విద్యార్థులకు బస్సు కేటాయిస్తానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరు మీద బస్సు రిజిస్ట్రేషన్ చేయించి సంబంధిత పత్రాలను కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొజ్జరాజుకు హెచ్‌వో రామస్వామి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట, మార్చి 29: రాజీవ్ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన రాజీవ్ యువ వికాసం పోస్టర్, హెల్ప్ డెస్క్ పోస్టర్‌ను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ. 4 లక్షల విలువ చేసే యూనిట్‌కు 70శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# సమన్వయంతో విధులు నిర్వహించాలి

- సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ




దౌల్తాబాద్ పీఎస్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీపీ అనురాధ

రాయపోల్, మార్చి 29: దౌల్తాబాద్, రాయపోల్ పీఎస్‌లను శనివారం సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ల పరిసర ప్రాంతాలు, సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్ రికార్డు, రైటర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం పీఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో ఉన్న వాహనాల అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని సీఐ, ఎస్సైలను అదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌పై నిఘా ఉంచాలన్నారు. ఇసుక, జూదం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ షేక్ లతీఫ్, సీసీఆర్‌బీ ఎస్సై రామకృష్ణ, ఎస్‌బీ ఎస్సై శ్రీధర్‌గౌడ్, రాయపోల్ ఎస్సై రఘుపతి, దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్, ఇతర పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, సీసీ తిరుపతిరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఉపాధికి ప్రభుత్వం చేయూత



దివ్యాంగుల ఎంపిక చేపడుతున్న ఎంపీడీవో

జగదేవపూర్, మార్చి 29: దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తున్నదని మండల అభివృద్ధి అధికారి రాంరెడ్డి తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఒక యూనిట్‌కు 34 మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల ఆర్థిక, శారీరక, మానసిక స్థితిగతులను ఎంపీవో ఖాజామొహినొద్దీన్‌తో కలిసి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు



యాంటీ డ్రగ్స్ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏసీపీ

సిద్దిపేట,టౌన్, మార్చి 29: యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని ఏసీపీ పుష్పన్ కుమార్ సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక గోడ పత్రికను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయోధ్యరెడ్డి, బాలకిషన్, కృష్ణయ్య, డాక్టర్ మధుసూదన్, దాసు, శ్రద్ధానందం, విశ్వనాథం, రాణి, పుణ్యమ్మ పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పాత బస్టాండ్,ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఆటోడ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. ఆటోల్లో డీజే, సౌండ్ బాక్సులు అమర్చవద్దన్నారు.ఆటోల వెనుక, ముందు భాగాల్లో అభ్యంతరకరమైన స్టిక్కర్లు తొలిగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకునూరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా



ఆకునూరులో డంపు చేస్తున్న రవాణాదారులు

చేర్యాల, మార్చి 29: మండలంలోని ఆకునూరు వాగు నుంచి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను చేర్యాల పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. చేర్యాల ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా వాగు పరిసర రైతులు గ్రామస్తుల సహాయంతో వాగు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసుకుని దశాబ్దాలుగా వాగు నుంచి ఇసుక ఇతర ప్రాంతాలకు రవాణా కాకుండా కాపాడుకుంటున్నారు. కేవలం గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలతో గృహాల నిర్మాణం ఇతర అవసరాల కోసం వాగు నుంచి ఇసుకను తీసుకుపోతే వాగు పరిరక్షణ కమిటీతో పాటు గ్రామస్తులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయరు కానీ వాగు నుంచి అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తే వెంటనే దానిని కాపాడుకుంటారు.ఇటీవల వాగు పరిరక్షణ కమిటీ సభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు ఇసుక రవాణాపై నిఘా పెట్టకపోవడంతో కొందరు వ్యక్తులు వాగు నుంచి ఇసుకను తమ సొంత అవసరాలకోసమంటూ గ్రామానికి తరలించి ఒకచోట డంపు చేస్తున్నారు.అర్ధరాత్రి 12 గంటలు దాటిన అనంతరం డంపు చేసే ప్రదేశం నుంచి ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని చేర్యాల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇసుక రవాణా చేయకుండా సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

# పిచ్చికుక్క స్వైర విహారం

- బక్రిచెప్యాలలో ఏడుగురికి గాయాలు



సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

సిద్దిపేట అర్బన్, మార్చి 29: మండలంలోని బక్రిచెప్యాలలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలోని ఏడుగురిని గాయపర్చడంతో బాధితులను సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇందులో చిన్నపిల్లలతో పాటు యువకులు, వృద్ధులు కూడా ఉన్నారు. దాడికిగురైన వారిలో అక్షయ్ కుమార్(14), కావ్య (20), భరత్ (25), బాబు (62), ప్రసాద్ (40), లక్ష్మి (55), కనకవ్వ (45) ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు మొత్తం ఏడుగురిని గాయపర్చిందన్నారు. కుక్కల భయంతో రోడ్డుపై పిల్లలు, వృద్ధులు తిరిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటి వ్యర్థాలు బయట పడేయడంతో కుక్కల బెడద ఎక్కువైందన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# డిపోను సందర్శించిన ఆర్‌ఎం



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

గజ్వేల్, మార్చి 29: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోను శనివారం రీజినల్ మేనేజర్ ప్రభులత సందర్శించారు. డిపోలోని ఎర్నింగ్, మెకానికల్, ఆఫీస్ విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా డిపోలో ఆదర్శంగా నిలిచిన డ్రైవర్లకు ప్రగతి చక్రం అవార్డులు ప్రదానం చేశారు. డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది సేవలను కొనియాడారు. వేసవిలో విధుల్లో ఉండే ఉద్యోగులకు తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. డిపోలో మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎం పవన్, బాబునాయక్, జమీల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 29:హుస్నాబాద్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ భూక్యా సరోజనపై చర్యలు తీసుకోవాలని దళితసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చెప్పులు ధరించి అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి అవమానపర్చిందని దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బత్తుల చంద్రమౌళి ఆరోపించారు. శనివారం దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కొమురయ్య, ఫ్రాన్సిస్, రాజు, స్వామి, రవి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మధు

మిరుదొడ్డి, మార్చి 29 : మండలంలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూమ్ టూ రీడ్ గ్రంథాలయంలో ఉన్న 14 వందల వివిధ రకాల పుస్తకాలు, ఇతర సామగ్రిని శనివారం రూమ్ టూ రీడ్ కో-ఆర్డినేటర్ మధు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రూమ్ టూ రీడ్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ రూమ్ టూ రీడ్ కార్యక్రమం మూడేండ్లు పూర్తైన సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 29: కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామంలోని సంపద వనాన్ని శనివారం డీఆర్డీవో జయదేవ్ ఆర్యా సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో నర్సింహారావు, సీటీఏ మహేందర్, ఏపీవో, టీఏ పాల్గొన్నారు.

## పిన్నింటికి జాతీయ ప్రతిభ నంది అవార్డు

కొమురవెల్లి, మార్చి 29 : మండలంలోని ఐనాపూర్‌కు చెందిన పిన్నింటి రత్నానికి హైదరాబాద్‌లోని బీఎంఆర్ బిర్లా సైన్స్ మ్యూజియం ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి జాతీయ స్థాయి ప్రతిభ నంది అవార్డును సినీనటుడు బాబుమోహన్, ఆర్గనైజర్ శిరీషారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పిన్నింటి రత్నంను గ్రామస్తులతో పాటు మండల ప్రజలు అభినందించారు.

## నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

రాయపోల్, మార్చి, 29: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు అండగా నిలుస్తుందని దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ రణం జ్యోతి అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి మధిర గ్రామానికి చెందిన దొంతి శంకరమ్మకు రూ.25వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

## పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

చేర్యాల, మార్చి 29: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల ఆస్తిపన్నులు, నల్లా బిల్లుల చెల్లింపుల కోసం ఈనెల 30, 31వ తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగేందర్ శనివారం ప్రకటనలో తెలిపారు.ఉగాది, రంజాన్ సెలవు రోజుల్లో సైతం ప్రజలు పన్నులు చెల్లించే విధంగా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ ఆస్తి పన్నులు, నల్లా బిల్లులతో పాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

## విద్యార్థిని చితకబాదిన వైస్ ప్రిన్సిపాల్

చేర్యాల, మార్చి29: చేర్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టెన్త్ చదువుతున్న విన్నీ అనే విద్యార్థిని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చితకబాదిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం కోసం ట్రాక్టర్‌లో సామగ్రిని సంబంధిత కాంట్రాక్టర్ తీసుకువచ్చి దాన్ని అన్‌లోడ్ చేసి, ట్రాక్టర్ అక్కడే పార్కు చేసి పక్కనే ఉన్న మెస్‌కు వెళ్లాడు. అదే సమయంలో విద్యార్థి విన్నీ ట్రాక్టర్‌పైకి ఎక్కి స్టీరింగ్ పట్టుకొని తిప్పుతున్న క్రమంలో గమనించిన వైస్ ప్రిన్సిపాల్ కర్రతో చితకబాదినట్లు తెలిపారు. ఈ ఘటనలో విద్యార్థి చేతికి గాయమైనట్లు సమాచారం. ఈ విషయమై ప్రిన్సిపాల్ నర్సింహాచారిని ఫోన్‌లో వివరణ కోరగా ట్రాక్టర్ నడిపేందుకు విద్యార్థి ప్రయత్నించగా అక్కడే ఉన్న విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో వైస్ ప్రిన్సిపాల్ అతన్ని వారించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు.

# రేషన్‌షాపు ఇన్‌చార్జిని మార్చాలి

- జేసీకి వినతిపత్రం అందజేసిన చిట్యాల గ్రామస్తులు

చేర్యాల, మార్చి 29: రేషన్‌షాపు నిర్వహణలో అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన వ్యక్తికి తమ గ్రామానికి చెందిన రేషన్ షాపు నిర్వహణ బాధ్యతలు ఎలా అప్పగిస్తారని, వెంటనే అతన్ని తొలిగించాలని, అతడి స్థానంలో నిజాయితీగా పనిచేసే డీలర్‌కు బాధ్యతలు అప్పగించాలని మండలంలోని చిట్యాలకు చెందిన పలువురు శనివారం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 10 సంవత్సరాలుగా చేర్యాలకు చెందిన ఓ డీలర్‌కు చిట్యాల రేషన్‌షాపు నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కొన్నిరోజుల క్రితం అతడిపై పోలీస్ కేసు నమోదు అయ్యిందని, అలాంటి డీలర్‌కు తిరిగి ఇన్‌చార్జిగా నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడి కేసు నమోదైన డీలర్‌కు ఏవిధంగా షాపు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారని, కేవలం రెండు రోజుల మాత్రమే రేషన్‌షాపులో సరుకులు ఇస్తాడని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అతడిని తొలిగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# బౌద్ధభిక్షువుల ఆందోళనకు సంఘీభావం



బౌద్ధ భిక్షువులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

సిద్దిపేట, మార్చి 29: బుద్ధగయలోని మహాబోధి విహార్‌ను చేజిక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్న బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ భిక్షువులు 45 రోజులుగా చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఉప్పర మల్లేశం తెలిపారు. శనివారం సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షురాలు రేణుక, మైల తిరుపతి, సాయిబాబా, మన్నే గంగోత్రి, సునీత, తిరుపతిరావు, ఎల్లేశ్, నాగరాజు, సాయితేజ, రమేశ్, సంతోష్, బద్ధిరాజు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌టౌన్, మార్చి 29: భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి గౌరవెల్లి రిజర్వాయర్‌ను త్వరలోనే నింపుతామని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి రాష్ట్రంలో ఉగాది పండుగను పురస్కరించుకొని సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు ముందుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఇందులో 2024-25 సంవత్సరానికి సంబంధించిన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల ఎంపిక ప్రక్రియ త్వరలోనే ప్రారంభంకానుందన్నారు. నాలుగు ఎకరాలకు ఎక్కువ ఉన్న వారికి సైతం త్వరలోనే రైతు భరోసా వేస్తామని, ఇది ప్రభుత్వం బాధ్యత అని తెలిపారు. నియోజకవర్గంలో వెయ్యిమందికి పైగా సీఆర్‌ఎంఎఫ్ చెక్కులు ఉగాది పర్వదినంనాడు పంపిణీ చేస్తామని చెప్పారు. తాగునీటిసమస్య రాకుండా చూసుకుంటామని, నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కరీంనగర్-హుస్నాబాద్‌కు నాలుగు లైన్ల రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, 150పడకల దవాఖాన హనుమకొండ రోడ్డులో నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలను మహాసముద్రం గండికి సమీపంలో నిర్మిస్తామని, ఇండ్రస్టియల్ పార్క్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, అయిలయ్య, ధర్మయ్య, వెన్నరాజు, రవీందర్, మార్క అనిల్, శ్రీనివాస్, ఎండీ హసన్, వల్లపు రాజు, జేపీసీ నాయకుడు వీరన్న పాల్గొన్నారు.

### ఇఫ్తార్‌విందులో పాల్గొన్న మంత్రి

హుస్నాబాద్ పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం రాత్రి ముస్లింలకు బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపవాస దీక్షలు చేస్తున్నవారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముస్లింలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గాంధీచౌరస్తాలోని సుందరీకరణ దృశ్యాలను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. చేపల మార్కెట్‌కు వెళ్లి అక్కడ ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లమ్మచెరువు కట్టపై సుందరీకరణ పనులను పరిశీలించి వేగంగా, నాణ్యతగా చేయాలని వారికి సూచించారు. హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పాల్గొన్నారు.

# ముందస్తు ఉగాది వేడుకలు



చేర్యాల: కొత్తదొమ్మాట పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు




హుస్నాబాద్ టౌన్: ముందస్తుగా ఉగాది పచ్చడిని తయారు చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఉగాది పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా జరుపుకొన్నారు. శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థినుల తీపి, వగరు, కారం, చేదు, లవణం, పులుపుతో కూడిన ఉగాది పచ్చడిని తయారీచేశారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులకు పచ్చడి అందజేశారు. ఈ సందర్భంగా ఉగాది ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. – సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మార్చి 29



గజ్వేల్: ఉగాది పచ్చడిని విద్యార్థులకు అందజేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమ



కొండపాక(కుకునూరుపల్లి): వేద ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు